# హతురాలి పేరు లాలిత్యం

ఈ మధ్య దేవిప్రసాద్ ఛటోపాధ్యాయగారు రాసిన పుస్తకం 'తంత్రవాదం' హైదరాబాద్ బుక్ ట్రస్ట్ వాళ్లను వదింపజేసి ప్రచురించింది చదవడం తటస్థించింది. అందులో తాంత్రిక వాదంలో స్త్రీకున్న ప్రాధాన్యం గురించి చాలా విపులంగా చర్చించడం జరిగింది.

మామూలుగా హ్యాపీగా చదువుకుందామని పుస్తకం (విపుల) తెరిస్తే, వీడెవడండీ బాబూ హా అంటే ఓ సంస్కృత శ్లోకమో... హీ అంటే ఓ ఇంగ్లీషు కొటేషన్‌నో రాసి మమ్మల్ని చంపడం కాక.. యిపుడు తంత్రవాదమూ మాంత్రికవాదమూ అంటూ వచ్చి తగలడ్డాడనుకుంటున్నారా? కోండి... కానీ తెల్సుకోదగ్గ విషయం కాబట్టిన్నూ; మీకు తెల్సుకుందామన్నా, సదరు పుస్తకం తమకు దొరకదనిన్నూ... అనేక నిన్నిన్నూలూనూ ఇది రాస్తున్నానన్న మాటనిన్నూ... అవధరించిండి...

"భూ మాతనూ, మానవమాతనూ ఒకే దృష్టితో చూసే పురాతన విశ్వాసం ప్రాచీన ప్రపంచంలోని మహాదేవతల (అమ్మతల్లుల), మహామాతల రూపకల్పనకు ఎంత సాయపడిందో ఓ పెద్దాయన విస్తృతంగా వివరించారు.

హైందవంలో ఉన్న ఒక్క ఉదాహరణను మాత్రం యిక్కడ చూద్దాం. తంత్రవాద మూలం ఆ ఉదాహరణలో దొరుకుతుంది కాబట్టి ప్రత్యేకంగా దాన్ని తీసుకుందాం... మార్కేండేయ పురాణంలో దేవీ మహాత్యం అనే ముఖ్యమైన అధ్యాయం ఉంది. దానిలో ఆ దేవి ఓ విచిత్రమయిన పలుకు పలికింది. 'ఓ దేవతాలారా! నా దేహం నించే పుట్టుకువచ్చే జీవపోషక శాకములతో ఈ ప్రపంచాన్ని పోషిస్తాను. అది కుంభవృష్టి కాలంలో సంభవిస్తుంది... శాకంబరిగా భూమిపై నేను ప్రసిద్ధి పొందుతాను... ఈ పేరు వెనక యావజ్జీవ పోషక వృక్ష సంతతి ఆమె శరీరంనించే (అంటే స్త్రీ శరీరం) ఉద్భవిస్తుందన్న అతి పురాతన విశ్వాసం దాగి ఉంది...

ఇంకొక అధ్యాయం చూడండి. ఆ అధ్యాయం పేరు 'వ్యావసాయిక కర్మకాండ.' అందులో రాసి ఉన్నది చూడండి...

ఒకానొక ఎర్ర ఇండియన్ల తెగ మండుటెండలలో పిల్లలను భుజాన వేసుకున్న స్త్రీలతో విత్తనాలు చల్లించడం చూసిన ఓ క్యాథలిక్కు పూజారి వారిని కోపగించుకోగా...

'అయ్యా! ఈ సంగతులు మీకేమీ అర్థంకావు, అందుకనే చికాకు పడుతున్నారు. ఆడవాళ్లు మాత్రమే పిల్లల్ని కనగలరనీ, మగవాళ్లు కనలేరనీ మీకు తెలుసు కదా! ఆడవాళ్లు విత్తనాలు చల్లితే జొన్నకర్ర రెండు మూడు కంకులు వేస్తుంది. కందమూలాలు రెండు మూడు బుట్టలనిండా వస్తాయి... అట్లా అన్నీ ఇబ్బడిముబ్బడిగా ఫలితాలనిస్తాయి... ఎందుకంటారు? ఆడవాళ్లకే పునరుత్పత్తి భేషుగ్గా తెలుసు. అది పిల్లలైనా సరే, ఫలసాయమైనా సరే... అట్లాంటి విషయాల్లో మగవాళ్లు అజ్ఞానులు' అని వాళ్లు జవాబిచ్చారట. అంటే ప్రకృతి సారం స్త్రీలలో ఉన్న మహత్తూ రెండూ ఒకటే అన్నది వాళ్ల ప్రగాఢ విశ్వాసం.

స్త్రీ స్పర్శా మహత్తువల్లా సరూపగుణ మహత్తువల్లా వ్యవసాయోత్పత్తిని పెంచవచ్చని వాళ్లు నమ్మారు...

ఇక్కడ స్త్రీ స్పర్శా మహత్తు అంటే మన పురాణాల్లో, ప్రబంధాల్లో చెప్పబడిన 'దోహద క్రియనే... దోహదానికి శబ్దరత్నాకరం యిచ్చిన అర్థం చూడండి.. తరుగుల్మలతాదులందు అకాలమునందు పుష్పాదులను పుట్టించెడు 'స్త్రీల' పాదతాడన క్రియ... ఇంకా ఆ దోహదం ఎన్ని రకాలు వుంటుందో కూడా చెప్పబడ్డది... ........ (తాడనం కాక) ముఖసీధువు, ఆలింగనము వీక్షణము, కరస్పర్శ, ముఖరాగం, .......పము, ఊర్పు, పాట, నవ్వు...

అతి పురాతనమైన, స్త్రీసార భూసారాలు ఒకటే అనే నమ్మిక... స్త్రీకి ఆ కాలంలో ఇవ్వబడ్డ మర్యాద మన్నన దైవత్వంగానే భావించాలి.. (పోరా మగవెధవా అట్లాగే అప్పట్నించీ మాతో సేద్యప్పన్లు కూడా చేయించారు అని ఆడవాళ్లంటే చేతులెత్తి దణ్ణం పెట్టడం తప్ప నే చేయగల్గిందేమీ లేదు)

నేను తాంత్రిక శక్తుల్ని అస్సలు నమ్మను... 'తంత్రవాదం' Academic Interest వల్ల చదివాను.. కానీ అందులో శాస్త్రజ్ఞులు విశదపరిచిన విషయాలు ఆశ్చర్యం కలిగించడం వల్లా... స్త్రీకి పురాతనకాలంలో ఇవ్వబడ్డ ప్రాముఖ్యత తెల్సుకోడం వల్లా – దీన్ని మీతో పంచుకున్నానంతే..

ఉపశ్రుతి : మొన్న మిత్రుడు వైద్యుడూ అయిన ఉమానాథ్ క్లినిక్‌లో కూచుని వున్నాను. అతని అసిస్టెంట్ పేషెంట్లను వరుస నెంబర్ల ప్రకారం లోపలికి పిలుస్తున్నాడు. ఒక్కోరూ వాళ్ల బాధలు చెప్పుకోవడం, మావాడు ఓపిగ్గా వినడం, మందులు రాయడం జరుగుతోంది... సుమారు రాత్రి ఎనిమిదిన్నర ప్రాంతం... ఇంతలో వున్నట్టుండి ఓ నలభై, నలభై అయిదు సంవత్సరాల వ్యక్తి దూసుకుని లోపలికొచ్చాడు...

"డాక్టర్‌గారూ! డాక్టర్‌గారూ! చాలా అర్జెంటు మా అమ్మ చాలా ఆయాసపడుతూ యిబ్బంది పడుతోంది.. చలి ముదిరేకొద్ది ఇంకా ఆయాసం ఎక్కువ అవుతోంది.. డెబ్బై

అయిదేళ్లు సార్! దయచేసి చూడండి సార్' అని ప్రాధేయపడ్డాడు మావాడు సరే అన్నట్టు తల పంకించి.. తన అసిస్టెంటుకు సైగ చేశాడు.. ఆ ముసలిద్నీ లోపలికి తీసుకురమ్మన్నట్టు.. ఆ ముసలావిడ కొడుకు చెప్పినట్టు ఆవిడకి డెబ్బై అయిదేళ్లుండవు మహా వుంటే అరవై అయిదు వుంటాయి. ఆవిడ ఆయాసపడడమూలేదు... అయితే కళ్లు మాత్రం కనిపించడం లేదు... మా వాడామెను పరీక్ష.... 'మిగతా అంతా ఆరోగ్యంగానే ఉందండీ. కళ్లకే రెండింటికీ శ్లుకాలు ముదిరిపోయాయి... అంతే. ఆపరేషన్ చేస్తే బాగవుతుంది, చూపు కూడా వస్తుంది.. అయినా అంత తొందర పెట్టారేమిటీ, ఆయాసం అనీ అదీ యిదీ అనీ" మందలించాడు

'సారీ సార్ లేటవుతుంది అని అలా చెప్పాను. సారీ... సారీ ఎక్స్ట్రీమ్లీసారీ"అన్నాడతను.

"ఇల్లు ఊళ్లోనేనా, ఊరేళ్లాలా? అన్నాడు మా వాడు ప్రిస్క్రిప్షన్ రాస్తూ.. "ఇక్కడే సార్" అన్న అతని సమాధానం విని... "ఇంటికి లేటేమిటయ్యా ఆఫీసుకు లేటన్నట్టు" అన్నాడు మా వాడు నవ్వుతూ...

ఇంతలో ఆ పెద్దామె లేచి నిలబడి రెండు చేతుల్తో కనబడని మా వాడికి దండం పెట్టి,

"లేటయ్యేది యింటికి కాదండీ డాక్టరుగారూ... హోమ్... హోమ్కు... నేనుండే హోమ్కు.. వీడు నన్నక్కడ వదిలి మళ్లీ ఊళ్లోకి రావాలి కదా..." అన్నది... దండం పెట్టడానికెత్తిన చేతుల్తో, కాంతిహీనమైన కళ్లలోంచి కారిన రెండు కన్నీటి చుక్కల్ని అదుముకుంటూ...

అక్కడ ఉన్న వాళ్ల గుండెలు బరువెక్కాయి..

ఈ వ్యాసం ముందునే ప్రస్తావించిన పురాతన కాలంలోని స్త్రీ... ప్రస్తుతంలో లాలిత్యం మనస్సుల్లోంచీ ఎక్కడికో ఎడారుల్లోకి వలసపోయి మానవత్వ అవశేషాలు కూడా హత్య చేయబడుతున్న కాలంలోని ఈ వృద్ధ స్త్రీ ఒక్కరేనా?! ●